మిర్చికి కూటమి తెగులు

మిర్చి రైతు కంట కన్నీరు నదిలా పారుతోంది. ఒక పక్క తెగుళ్లతో దిగుబడి తగ్గిపోగా.. మరో పక్క వచ్చిన దిగుబడికి కూటమి ప్రభుత్వం సరైన ధర కల్పించకపోవడంతో అగమ్యగోచరంగా తయారైంది. గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా రూ.21 వేలకు పైగా పలకగా నేటి ప్రభుత్వంలో రూ.10 వేలు ధర పలుకుతోంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాదని.. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక గందరగోళంలో ఉన్నాడు..


కల్లంలో కాయలు ఏరుతున్న కూలీలు

- మిర్చి రైతులకు వైరస్ టెన్షన్
- రోజురోజుకూ దిగజారుతున్న ధరలు
- క్వింటా రూ.10 వేలకు మించని దుస్థితి
- నియోజకవర్గంలో 1390 ఎకరాల్లో మిర్చిసాగు

లింగసముద్రం:

రబీ సీజన్‌లో మిరప పంట సాగు చేసిన రైతులు తెగుళ్ల సమస్యలతో సతమతమవుతున్నారు. పైబాగుంటుందనుకున్న సంతోషం అన్నదాతలకు ఎక్కువ రోజులు నివలడం లేదు. ముఖ్యంగా పంటకు తామర పురుగు వ్యాపించడంతో కర్షకులకు ఆందోళన తప్పడం లేదు. నియోజకవర్గంతో మిర్చి తోటలను రైతులు అధికంగా సాగుచేశారు. మొక్కలు ఏపుగా పెరగడంతో దిగుబడి అధికంగా వస్తుందనుకున్న సమయంలో మిర్చి తోటకు తామర పురుగులు, నల్లి, తెల్లదోమ, పచ్చదోమ ఆశించి అతలాకుతలం చేసింది. ఇటీవల మిర్చి పంటపై కొమ్మ తెగులు, కుచ్చుతెగులు ప్రభావం చూపించగా తాజాగా పూతలో తామర పురుగుతో పాటు నల్లి తెల్లదోమ, పచ్చదోమ ఆశించడంతో రైతులు విరివిగా రసాయన మందులు పిచికారీ చేశారు. రాత్రింబవళ్లు కంటికి రెప్పలా పెంచుకున్న పంట వైరస్‌తో దెబ్బతింటుండడంతో రైతులు దిక్కుతోచని పిరిస్థితిలో ఉన్నారు. నియోజవకర్గంలో 1390 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. కందుకూరు మండలంలో 485, వలేటివారిపాలెం మండలంలో 395, లింగసముద్రం మండలంలో 350, గుడ్లూరు మండలంలో 100, ఉలవపాడు మండలాల్లో 60 ఎకరాలు సాగుచేశారు.

తామర పురుగుతో పంటకు దెబ్బ..

తామర పురుగుతో పాటు నల్లి, పచ్చదోమ, తెల్లదోమ


వైరస్ సోకడంతో దెబ్బతిన్న మిర్చితోట

వ్యాప్తి చెందుతోందని గుర్తించిన వారం రోజుల వ్యవధిలోనే పంట నాశనమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు రైతులు పురుగు మందుల కొనుగోళ్లకు రూ. వేలల్లో ఖర్చు పెడుతున్నారు. దీనికి తోడు కోత ఇతర ఖర్చులు భారీగా పెరిగాయి. ఎకరా సాగు మొత్తం రూ.2.75 లక్షల వ్యయమవుతోంది. రూ.2 నుంచి రూ.3 వడ్డీకి దొరికిన చోట్ల అప్పులు తెచ్చి పొలంపై పెట్టారు. ఎకరాకు ఐదు నుంచి పది క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు.

మందులు పిచికారీ చేసినా..

తామర పురుగు, నల్లి, తెల్లదోమ, పచ్చదోమ నివారణకు పలు రసాయన మందులు ఎన్నిసార్లు పిచికారీ చేసినా ఫలితం కనిపించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి తెగుళ్ల సోకకుండా ఉండుంటే ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగడుబడి వచ్చేదని, అయితే ఎరువులు, రసాయన మందులు ధరలు పెరగడంతో పాటు కూలీల రేట్లు కూడా పెరగడంతో పెట్టుబడి మరింత భారం పెరిగిందని రైతులు చెప్తున్నారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

మిరప ధరలు తగ్గుదల (రూపాయల్లో)

సంవత్సరం	నెల	క్వింటాలు	సగటు ధర
2023	డిసెంబరు	21,000	26,000
2024	మార్చి	13,500	16,500
2024	నవంబరు	11,500	16,500
2025	జనవరి	9,000	10,000


మొక్కకు సోకిన వైరస్

వ్యాపారుల సిండికేట్.. పట్టని కూటమి ప్రభుత్వం.

మిర్చి దిగుబడి అంతంతమాత్రంగా ఉన్నా గిట్టుబాటు ధర రావడం లేదని, వ్యాపారస్తులు సిండికేట్ కావడమే కారణమని రైతులు చెప్తున్నారు. వ్యాపారులు అంతా కలిసి మిర్చి ధరను తగ్గించి వేశారని కేవలం రూ. 10 వేలకు మాత్రమే కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం ఏమాత్రం రైతులపై జాలి కూడా చూపించడం లేదు. మిర్చి రైతుల బాధలు తెలుసుకున్న మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతుల వద్దకు వెళ్లి పరామర్శించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఇప్పటికైనా ప్రబుత్వం జోక్యం చేసుకుని మిర్చికి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లతో పంట నాశనమైంది..



తామర పురుగు, నల్లి, పచ్చదోమ, తెల్లదోమ మిర్చి పంటకు ఆశించడంతో పంట నాశనమవుతోంది. కౌలుకు తీసుకుని ఐదెకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. మొన్నటి వరకు మిర్చి పంట బాగానే ఉంది, మంచు ఎక్కువగా కురుస్తుండడంతో వాతావరణం అనుకూలంగా లేక పోవడంతో తామర పురుగు, నల్లి, పచ్చదోమ, తెల్లదోమ కినిపించి పూత, లేత ఆకులు రాలిపోతున్నాయి. ఇప్పటి వరకు ఎకరాకు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాను.

– మద్దెల రవి, మిర్చి రైతు, రాళ్లపాడు

గిట్టుబాటు ధర కల్పించాలి..



మిర్చి తోటలకు రకరాల తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా తామర పురుగు, నల్లి, పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో పురుగు మందులను పిచికారీ చేసేందుకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. పురుగు మందుల ధరలు, కూలీ రేట్లు పెరిగి పోయాయి. పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడి తగ్గి నష్టాలు వచ్చే అవకాశం ఉంది. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గొర్రెపాటి ప్రభాకర్, మేదరమిట్లపాలెం

ఫార్మర్ రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తిచేయాలి


ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): రైతులు విధిగా రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు పూర్తి చేయించుకోవాలని వ్యవసాయాధికారి బత్తుల సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లె రైతుసేవాకేంద్రాల్లో నమోదుచేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ అనేది భూమి కలిగిన ప్రతి రైతుకు ఒక ప్రత్యేక విశిష్ఠ గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం, పారదర్శకంగా మరింత అందుబాటులోనికి తెచ్చేందుకేనన్నారు. రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ పథకంలో భాగంగా 19వ విడతగా ఒక్కో రైతుకు రూ.2 వేలు వారి ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమచేస్తుందన్నారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వీఏఏ ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టపగలే వీధి దీపాల వెలుగులు


పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

కొండపి: మండలంలోని కొండపి పంచాయతీలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీధి దీపాలు నిరంతరంగా వెలగంతో పంచాయతీకి బిల్లులు అధిక మొత్తంలో వస్తున్నాయి. వీధిదీపాల వరకు ప్రత్యేకమైన విద్యుత్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఆదా చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం 25వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ.నేతాజీ సుబ్బారెడ్డి, జీవీ కృష్ణంరాజు, ఎంవీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు.

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

సింగరాయకొండ: పీఎం కిసాన్ 19వ విడత నిధులు లబ్ధిదారులకు సోమవారం ఖాతాల్లో జమవుతాయని వ్యవసాయాధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 3,154 మంది రైతులకు రూ.63.08 లక్షల జమవుతాయని పేర్కొన్నారు. పాసు పుస్తకం ఉండి రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకు నగదు జమవుతుందన్నారు. ఇప్పటివరకు 2,680 మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన రైతులు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

టంగుటూరు: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథపాలకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో సృజనాత్మకత పెరుగుతుందన్నారు.

డిప్యూటీ డీఈఓకి సన్మానం

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): డిప్యూటీ డీఈఓగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన చంద్రమౌలేశ్వరావును కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా సన్మానించారు. స్టేట్ అడిషనల్ డైరెక్టర్ కె.రవేంద్రనాథరెడ్డి, డీఈఓ కిరణ్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు. మార్కాపురం డిప్యూటీ డీఈఓ శామ్యూల్, ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, ఉడుముల నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, ఆర్ కొండారెడ్డి, సంజీవి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వాసవీ ఆలయ నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణంచేసిన అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

పామూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నూతన కమిటీ ఎన్నిక ప్రమాణస్వీకార కార్యక్రమం వాసవీమాత ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నూతన అధ్యక్షునిగా కోట నరసింహారావు, ఉపాధ్యక్షునిగా మంచికంటి మధు, కార్యదర్శిగా గాదంశెట్టి వెంకట గురునారాయణ, కోశాధికారిగా దరిశి రాజేష్, జాయింట్ సెక్రటరీలుగా రాచూరి సాయి, కొత్తూరి హరగోపాల్, మరో 32 మందితో నూతన కార్యవర్గం ఏర్పడగా ఆలయంలో వారు ప్రమాణస్వీకారం చేశారు. నాయకులు విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, మంచికంటి సుబ్బారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు ఇస్తున్న దాత కృష్ణా, చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: కోట లక్ష్మీనరసింహ వర్ధంతి సందర్భంగా మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవాహిత కార్యక్రమాలను కొనియాడారు. వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు, వాసవీ సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, థెరిస్సా సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌ఎన్ రసూల్, పసుపులేటి అరుణోధర్, కోఆప్షన్ సభ్యుడు గూడూరి అబ్రహం లింకన్, డాక్టర్ పచ్చవ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూనిక్ ఐడీ తప్పనిసరి

పీసీపల్లి: రైతులందరికీ యూనిక్ ఐడీ నంబర్ తప్పనిసరని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని అలవలపాడు, పీసీపల్లి, నేరేడుపల్లి, మారెళ్ల, వెంగలాయపల్లి, పిల్లివారిపల్లి గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఏడీఏ వెంకటరమణ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ ప్రకాష్‌రావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం


శేషవాహనం, రథోత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నాల్గవరోజు ఆదివారం అర్చకులు మంకాల శివ ప్రసాద్‌శర్మ, పప్పు శ్రీకాంత్ ఆధ్వర్యంలో కూష్మాండహోమం నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, వేదపారాయణం, లఘు పూర్ణాహుతి అనంతరం గోపూజ నిర్వహించి మహానైవేద్యం సమర్పించారు. విధంగా సాయంత్రం వేదపారాయణం, దీక్షా హోమాలు రాత్రికి నారాయణస్వామి ఉత్సవమూర్తికి పల్లకిసేవ, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తిస్వామికి శేషవాహన రథోత్సవం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, చావా సుబ్బయ్య, ఉభయదాతలు పాల్గొన్నారు.


మహానైవేద్య ప్రదక్షిణలో పాల్గొన్న ఈఓ, చైర్మన్, భక్తులు


గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఉన్నత విద్యతో భవితకు బంగారు బాట


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎస్సై

పామూరు: ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా అది యువత భవితకు బంగారు బాటగా నిలుస్తుందని ఎస్సై టి.కిషోర్‌బాబు అన్నారు. స్థానిక అనిల్ గార్డెన్స్‌లో ఆదివారం రత్నం విద్యాసంస్థలు, బెల్లంకొండ, ఆదిత్య జూనియర్ కళాశాలల ఇంటర్మీడియెట్ సీనియర్ విద్యార్థులు, టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం విద్యాసంస్థల యాజమాన్యం మద్దుల శ్రీనివాసులు, బెల్లంకొండ విజయలక్ష్మి, శ్రీనివాసరావుల అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎస్సై కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతోపాటు క్రీడలవైపుకూడా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు నాగరాజు, వెంకటేష్, ఖాదర్‌వలి, వెంకటసుబ్బయ్య, మాలకొండయ్య, షరీఫ్, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

షూరిటీ లేకుండా రుణాలు అందించాలి


విజయ్‌బాబుతో మాట్లాడుతున్న మాలల ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు

టంగుటూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షూరిటీ లేని రుణాలు అందించాలని రాష్ట్ర మాలల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు కోరారు. మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయబాబు ఆదివారం టంగుటూరు వచ్చిన సందర్భంగా అశోక్‌బాబు, అంబేడ్కర్ యువత ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు వినతిపత్రం అందజేశారు. జైభీమ్ రావు పార్టీ అధ్యక్షుడు కేవీ కృష్ణారావు, వెల్ఫేర్ ఫ్యూజ్వల్, రామకోటయ్య, శ్రీను, మురళి, శ్రీకాంత్, రాజేష్, కె.రాజు, బ్రహ్మయ్య, కార్తీక్, శ్రీధర్ పాల్గొన్నారు.

కూలిన పల్లెవాగు చప్టా

- ఆగిన రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న వివిధ గ్రామాల ప్రజలు


కూలిపోయిన చప్టా

కందుకూరు రూరల్: ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించి చప్టా ఇటీవల ఈ రోడ్డులో భారీ వాహనాలు రాకపోకల సాగించడంతో చప్టా కూలింది. కందుకూరు నుంచి చుట్టుగుంట వెళ్లే రోడ్డులోని పల్లెవాగు చప్టా కూలిపోయింది. ఉలవపాడు నుంచి ఆత్మకూరు మీదుగా చుట్టగుంట, కందుకూరుకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే తారు రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పోసేందుకు టిప్పర్ల ద్వారా ట్రావెల్ మట్టిని తీసుకు వచ్చేందుకు వచ్చిన టిప్పర్ల ధాటికి చప్టా ఒక పక్క పూర్తిగా కూలిపోయింది. అంతే కాకుండా కర్ర ట్రాక్టర్లు కూడా ఎక్కువగా తిరుగుతుండడంతో చప్టా దెబ్బ తినింది. ఈ రోడ్డులో కందుకూరు నుంచి చుట్టుగుంట, గళ్లవారిపాలెం, ముక్కోడిపాలెం, ఆత్మకూరు, మన్నేటికోట, ఉలవపాడు గ్రామాలకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. కందుకూరు నుంచి ఉలవపాడు వెళ్లేందుకు ఇదే షార్ట్‌కట్ రోడ్డు కావడంలో లారీలు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిత్యం తిరుగుతుంటాయి. దీంతోపాటు 167–బీ జాతీయ రహదారి చుట్టుగుంట రోడ్డు మీదుగా నిర్మాణం జరగడంతో వాహనాల తాకిడి పెరిగింది. చప్టాలు ఎప్పటి నుంచో దెబ్బతిని ఉన్నాయి. దీనిపై అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. తారు రోడ్డు నిర్మాణం కూడా తారు వరకు వేశారు. చప్టా ప్రతిపాదనలో లేకపోవడంతో వదిలేశారు.

హెచ్చరిక బోర్డులు లేని వైనం..

చప్టాపై కూలిన చోట ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో వాహనాలు వేగంగా వస్తే ప్రమాదాలకు గురికాక తప్పదు. కూలిన చోట ఎండిపోయి కొమ్మను వేసి వదిలేశారు. ఈ కొమ్మ ప్రమాదాలు జరగకుండా ఎలా కాపాడుతుందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు ఇలా ఉండే ప్రయాణం ఏలా చేయాలని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే వరకు అధికారులు స్పందించరు. ఆ తర్వాత వచ్చి హడావుడి చేస్తారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం


పన్ను కట్టించుకుంటున్న డీఎల్‌పీఓ పద్మ

సింగరాయకొండ: చెత్త నుంచి సంపద సృష్టించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించి చెత్త రహిత గ్రామం గా తీర్చిదిద్దడమే స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఒంగోలు డీఎల్‌పిఓ ఆర్ పద్మ అన్నారు. ఆదివారం టంగుటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందించాలన్నారు. ఆ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తీసుకుని వెళ్లి వర్మీ ఎరువును తయారు చేసి ప్రతి గురువారం విక్రయిస్తామన్నారు. దీని వల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుకాణదారుల వద్ద స్వయంగా పన్ను వసూలు చేసి ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఎస్ జగదీష్‌బాబు, బిల్ కలెక్టర్ చెరుకూరి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు


కనుమళ్ల జంక్షన్ వద్ద బస్సు కోసం వేచి ఉండే ప్రాంతం చీకటిగా ఉన్న దృశ్యం

సింగరాయకొండ: దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం జాతీయరహదారిపై ఆర్టీసి, ప్రైవేటు బస్సులు ఆగే విధంగా బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంతో పాటు కందుకూరు మండలాల ప్రజలు చెన్నై, బెంగుళూరు, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులపై ఆధారపడతారు. ఇందుకోసం ప్రజలు జాతీయరహదారి పై విమానాల రన్‌వే పై కనుమళ్ల జంక్షన్ వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉంది. దూరప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండ్లోకి రాకుండా నేరుగా వెళ్తుండడంతో రిజర్వేషన్ చేయించుకున్న ప్రజలు ఈ బస్సుల కోసం జాతీయరహదారిపై కనుమళ్ల జంక్షన్ వద్ద రాత్రి, పగలు లేకుండా వేచి ఉండాల్సి ఉంది. ఆర్టీసీ అధికారులకు ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు బస్టాండులోకి రాకుండా జాతీయ రహదారి గుండా వెళ్తున్నాయి. ఈ ప్రాంతం నుంచి ముఖ్యంగా దూరప్రాంతాలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు వెళ్తుంటారు. వీరు రాత్రి సమయంలో జాతీయరహదారి పై వేచి ఉండాలంటే ఒక్కోసారి ఆకతాయిల కారణంగా భయపడే పరిస్థితి ఉంది. వాస్తవానికి కందుకూరు ఫ్లైఓవర్ వద్ద ఉన్న సర్వీసు రోడ్డులో దుకాణాలు ఉన్నా ఆ మార్గం గుండా బస్సులు వెళ్లే పరిస్థితి లేదు. ఆర్టీసీ డ్రైవర్లు బస్టాండ్‌లోకి రామని చెప్పడంతో కనుమళ్ల జంక్షన్ వద్ద చీకట్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉంది. కందుకూరు ఫ్లైఓవర్ వద్ద అయితే ప్రజలు బస్సు ఎక్కడానికి, దిగటానికి అనుకూలంగా ఉంటుంది. అధికారులు స్పందించి కందుకూరు ఫ్లైఓవర్ వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి బస్సులు సర్వీసురోడ్డులో అటుగుండా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాంటున్నారు. లేకుంటే కనుమళ్ల జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ నిర్మించి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి ప్రయాణికులకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మన్నేటికోటకు నీళ్లొచ్చాయి


పైపు లైన్లు రిపేరు చేస్తున్న సిబ్బంది

ఉలవపాడు: మన్నేటికోట గ్రామానికి కుళాయిల ద్వారా నీళ్ల వదిలారు. ఆదివారం సాక్షి దిన పత్రికలో మన్నేటికోట–నీటికి కటకట అనే కథనానికి అధికారులు స్పందించారు. పైపు లైన్ల మరమ్మతులను పరిశీలించారు. వాటికి రిపేర్లు చేసి పైపు లైను నుంచి నీరు వెళ్లేలా చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కూలీల సహాయంతో పనులు చేసి గ్రామానికి నీరు వదిలారు. ఆదివారం దక్షిణ మన్నేటికోట, తిరుపతిగుంట, గిరిజన కాలనీలలో నీరు కుళాయిల ద్వారా వచ్చాయి. దీంతో కాలనీ వాసులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.